చంద్రయాన్-3 విజయోత్సాహం

- జాతీయజెండాలతో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించిన విద్యార్థులు
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ నినాదాలు

చంద్రయాన్-3 విజయవంతమైన నేపథ్యంలో గురువారం పలుచోట్ల విద్యార్థులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడంతోపాటు మానవహారాలు ఏర్పాటు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు.


అల్లూరులో మానవహారం ఏర్పాటు చేసిన గురుకుల విద్యార్థులు

అల్లూరు: స్థానిక ఆర్‌డీఆర్ కాలనీలోని గురుకుల పాఠశాల విద్యార్థులు పాత బస్టాండ్ సెంటర్ వరకు జాతీయజెండాలను చేతబట్టి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పీవీ రమణప్రసాద్ మాట్లాడుతూ చంద్రయాన్-3 ద్వారా భారతదేశ శాస్త్ర, సాంకేతిక విజయాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. మన శాస్త్రవేత్తల మేధస్సును ప్రతి ఒక్కరూ అభినందించాలని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపచేయాలని కోరారు. అనంతరం పాత బస్టాండ్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేసి.. జై భారత్.. జైజై ఇస్రో అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిగిరిలో..

కలిగిరి: చంద్రయాన్-3 విజయవంతమైన నేపథ్యంలో గురువారం కలిగిరిలోని ఇన్‌ఫాంట్ జీసస్ స్కూల్ విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి కలిగిరమ్మతల్లి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం గ్రామంలో చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ జెండాలతో జయహో ఇస్రో, జయహో చంద్రయాన్ అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. చంద్రయాన్-3 విజయం ఇస్రో సాధించిన అతి పెద్ద విజయమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, పీవీ రమణ, మహేష్, రమణరాజు, మదీనా, మాధవి, శివకృష్ణ, లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


చేజర్ల: జాతీయజెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నేడు సత్యవోలులో ‘గడప గడపకు..’

కొండాపురం : మండలంలోని సత్యవోలు పంచాయతీలో శుక్రవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి చిమ్మిలి రవీంద్ర గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు ‘గడప గడపకు మన ప్రభుత్వం’పై సమీక్ష

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 8 సచివాలయాల పరిధిలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం ముగిసిన నేపథ్యంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్లు కమిషనర్ బి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో కౌన్సిలర్లు, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

క్లుప్తంగా

కావలి వాసికి రాష్ట్ర పదవి


నియామకపత్రం అందుకుంటున్న ఖాదర్‌బీ

కావలి: కావలి పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌బీని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్‌బీ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ నూర్‌బాషా సంఘీయులకు సేవ చేస్తానని తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

ఉదయగిరి: మనబడి నాడు–నేడు కార్యక్రమం రెండో విడతలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఏపీఈ డబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మహేంద్ర, ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 14, 16 తేదీల్లో రివాల్వింగ్ ఫండ్ జమ అయిన పాఠశాలల హెచ్‌ఎంలు పనులు పూర్తిచేయాలన్నారు. ఎలక్ట్రికల్ వస్తువులు ఏవైనా కొనుగోలు చేసి ఉంటే ఎస్‌ఈఎంఎస్‌ఎస్ యాప్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు. పూర్తి చేసిన పనుల వివరాలు, అందుకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞాన పుస్తకాల వితరణ



కావలి రూరల్: మండలంలోని ఆర్‌సీపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞాన పుస్తకాలు వితరణగా అందజేశారు. గురువారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు ఘనీబాషా మాట్లాడుతూ జర్నలిస్టు కె.రాజశేఖర్ జ్ఞాపకార్థం, అలాగే చంద్రయాన్-3 విజయాన్ని పురస్కరించుకుని అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు విద్యార్థులకు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.జగన్నాథ్, సామాజికవేత్త మాలకొండారెడ్డి, సంస్థ సభ్యులు వి.వెంకటరమణ, ఎం.మహేష్, డి.వెంకటసురేంద్రరెడ్డి, పి.ఫయాజ్, పి.వీణామాధవి, రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఏపీసీ



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట కేజీబీవీని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

వరికుంటపాడు: మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి సూచించారు. గురువారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వేంపాడు సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి నిర్వాహణపై సిబ్బందికి సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుకి అందేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 31వ వార్డుకు చెందిన పలువురు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైకుంఠపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి చెందిన కన్నయ్య, పుల్లయ్య, శ్రీకాంత్, జయమ్మ, స్వామి, రాణి, మాధవి, మనోజ తదితర కుటుంబాల వారు పార్టీలో చేరడం సంతోషకరమని తెలిపారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంచితనం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామని తెలిపారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శ


నరసమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం వెన్నవాడ మాజీ సర్పంచ్ చల్లగొండ్ల నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో గురువారం జరిగిన ఉత్తరక్రియల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు దిశించర్ల ప్రసాద్, జగన్నాథం ప్రసాద్, దాడి శ్రీనివాసులునాయుడు తదితరులు ఉన్నారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు హజరత్తయ్య ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో గురువారం జరిగిన ఉత్తరక్రియల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ పులిమి రమేష్‌రెడ్డి, తిరుమల, మధు, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం


చేజర్ల: గాలిపాళెంలో రథం ఊరేగుతున్న భక్తులు


ఆత్మకూరురూరల్: దేపూరులో వెంకయ్యస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు


సంగం: విశేష అలంకరణలో వెంకయ్యస్వామి

చేజర్ల: భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని గాలిపాళెంలో ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం శ్రీహరిస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించారు. అలాగే సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. మండలంలోని పుల్లనీళ్లపల్లి గ్రామంలోని వెంకయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అనంతసాగరం మండలంలోని పడమటిఖమ్మంపాడు, చిలకలమర్రి, జమ్మినగుంట గ్రామాల్లోని వెంకయ్యస్వామి ఆలయాల్లో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నెల్లూరుపాళెంలో..

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెంలో వెలసిన వెంకయ్యస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం స్వామివారి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించారు. అఖండ భజనలు చేశారు. స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో..

ఆత్మకూరురూరల్: మండలంలోని దేపూరు, మహిమలూరు, ఆరవీడు జంగాలపల్లి, బట్టేపాడు, తదితర గ్రామాల్లో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రత్యేక పూజలు

సంగం: స్థానిక వెంకయ్యస్వామి ఆలయాల్లో గురువారం స్వామివారి ఆరాధనోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

పోలీస్ కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన పోలీస్ కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. పోలీస్ కాలనీ తొమ్మిదో వీధిలో కామాక్షి, మనోహర్‌రెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌గా కామాక్షి.. ప్రైవేట్ టీచర్‌గా మనోహర్‌రెడ్డి పనిచేస్తున్నారు. తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో కొంతకాలంగా సాలుచింతలలో ఉంటూ భార్య వద్దకు వచ్చి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఉద్యోగానికి కామాక్షి మంగళవారం వెళ్లారు. ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో తన కుమారుడితో కలిసి పోలీస్ కాలనీ ఐదో వీధిలో ఉంటున్న తల్లితండ్రుల వద్దకెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తలుపులను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. పడక గదిలోని బీరువాను పగలగొట్టి అందులో ఉన్న సుమారు ఆరున్నర సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఇంటికి గురువారం ఉదయం వచ్చిన బాధితురాలు చోరీ జరిగిందనే అంశాన్ని నిర్ధారించుకొని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

దుత్తలూరు: దుత్తలూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల్లోని సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

ఆయిల్ దుకాణంలో చోరీ

ఉదయగిరి: పట్టణంలోని మసీదు కాంప్లెక్స్‌లోని ఆయిల్ దుకాణంలో గురువారం వేకువజామున చోరీ జరిగింది. ఈ మేరకు దుకాణదారుడు సందాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మసీదు కాంప్లెక్స్‌లోని ఆయిల్ గోదాము షట్టర్ తాళాలు పగలగొట్టి 200 లీటర్ల ఆయిల్ బాటిళ్లను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. రెండ్రోజుల క్రితం కాంప్లెక్స్‌లోని ఓ చిల్లర దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

జూదరుల అరెస్ట్

కావలి రూరల్: కావలి రూరల్‌లోని అడవి రాజుపాళెం వద్ద గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కావలి రూరల్ ఎస్సై సుమన్ తెలిపారు. అడవిరాజుపాళెం చెరువు వద్ద కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోని తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సచివాలయం తనిఖీ

సంగం: స్థానిక సచివాలయం-3ను గురువారం తహసీల్దార్ నాగరాజు తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించి సంక్షేమ పథకాల అమలు తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి గ్రామం వద్ద ఇసుక లోడుతో వెళుతున్న ఓ టిప్పర్ బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. సీతారామపురం మండలం పడమటి రొంపిదొడ్లకు చెందిన ఊజర్ల మోహన్‌రెడ్డి ఉదయగిరి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో ఉదయగిరి నుంచి సీతారామపురం వైపు వెళుతున్న ఇసుక టిప్పర్ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మోహన్‌రెడ్డికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి చికిత్సనిమిత్తం ఉదయగిరిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

చేజర్ల(సోమశిల): దర్గాకు వెళ్లే దారి వివాదంలో రెండు వర్గాల వారు పరస్పర దాడులకు పాల్పడడంతో ఇరువురికి స్వల్పగాయాలైన ఘటన అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలో గురువారం చోటుచేసుకొంది. సోమశిల ఎస్సై బోజ్యానాయక్ తెలిపిన వివరాల మేరకు దర్గాకు వెళ్లే దారికి సంబంధించి స్థానిక పంచాయతీ కార్యదర్శి స్థల ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసులు అందించిన నేపథ్యంలో ఇరువర్గాల వారు దాడులకు పాల్పడగా షేక్ బాదుల్లా, షేక్ సుబానిలకు స్వల్పగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం ఇరువురినీ ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భ్రమల్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: తెలంగాణ రాష్ట్రంలో స్థిర నివాసాలు ఏర్పరచుకున్న ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్ కళ్యాణ్ భ్రమల్లో ఉన్నారని, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అయిపోయినట్లుగా కలలుకంటున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. కావలిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులను.. మీ అంతు చూస్తామంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ బెదిరిస్తున్నారని, అలాగే టీడీపీ నాయకులు కూడా తాము అధికారంలోకి వచ్చాక ‘మీ అంతు చూస్తాం’ అంటూ ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ నోరుపారేసుకుంటున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రజలకు అందిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ పై బురద జల్లే కార్యక్రమంలో మునిగిపోయారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, మహిళా నాయకురాలు పొనుగోటి అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన పల్లపు రమణమ్మ

కావలి రూరల్: ముందు వెళ్తున్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన గురువారం గౌరవరం టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు బోగోలు మండలం కొండబిట్రగుంటకు చెందిన పుసుపులేటి మహేష్, అతని అమ్మమ్మ పల్లపు రమణమ్మ స్వగ్రామం నుంచి కావలికి బైక్‌పై వస్తున్నారు. కావలి సమీపంలో గౌరవరం టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనపై రూరల్ ఎస్సై టి.సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రాక్షి అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం


చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం చుంచులూరులో వెలసిన శ్రీఇంద్రాక్షి అమ్మవారి తిరునాళ్లు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు గణపతిపూజ, లక్ష్మీ గణపతి హోమం, చండీహోమం, ప్రత్యేక పూజలను ఆలయ ప్రధానార్చకుడు మురళీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేమన చెంచురత్నం, ఆయన కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

శిక్షణ తరగతులు

చేజర్ల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మడపల్లి గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ మండల కోఆర్డినేటర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నారాయణ, ఎల్.వసంత, గాలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై వినతి

ఉదయగిరి: పట్టణంలోని దేవలాలగడ్డ వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆ ప్రాంతానికి చెందిన మహిళలు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ, పంచాయతీ ఈఓ నరసయ్యకు విన్నవించారు. స్పందించిన ఈఓపీఆర్డీ మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సాయి ఆలయంలో పూజలు

వరికుంటపాడు: స్థానిక షిరిడి సాయిబాబా ఆలయంలో నిజ శ్రావణ మాస దుర్గాష్టమి వ్రతం సందర్భంగా గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు బత్తల వెంకటప్రసాద్ – సుజాత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం రేపు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర సాయిమాత నిత్యాన్నప్రసాదాలయ ద్వారకామాయి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి నామ సంకీర్తన, అన్నప్రసాదాన్ని అందజేయనున్నామని చెప్పారు. ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నాణేల స్వాహాపై దర్యాప్తు

పొదలకూరు : చిట్టేపల్లి అంకమ్మతిప్ప వద్ద లభ్యమైన పురాతన బంగారు నాణేల స్వాహాలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. కాగా గురువారం అమరావతి నుంచి సెంట్రల్ ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా టాస్కింగ్ స్టాఫ్ వింజమూరు ప్రతాప్ స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చి కేసు వివరాలను సీఐ సంగమేశ్వరరావు వద్ద సేకరించారు. ప్రస్తుతం విచారణలో నిందితులుగా అంకయ్య, అమరన్, అజిత్‌లపై కేసు నమోదు చేసి రూ.15 లక్షల విలువైన బంగారు నాణేలతో పాటు నిందితులు చెన్నైలో అమ్మిన ఆభరణాలు ద్వారా వచ్చిన రూ.14 లక్షల నగదుతో వారు కొనుగోలు చేసిన ఆటో, పాతకారులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. విజయనగర కాలం నాటి నాణేలుగా పురావస్తుశాఖ వారు గుర్తించినట్లు తెలుస్తోంది.